మాక్స్ వాన్ డెర్ గ్రున్

అంగ్లానువాదం : ఆర్. టి. కె. సైమింగ్టన్

# 7. కార్మిక సంఘ సభ్యుడు

రాత్రి పనిచేసే గని కార్మికులు ఉదయం ఏడుగంటలప్పుడు ఇళ్ళకుపోతారు. అంతకుముందే రాత్రి జరిగిన ప్రమాదం సంగతి ఊళ్ళో జనానికి తెలిసింది. రాత్రి సరిగ్గా మూడు గంటలప్పుడు 'సూర్య' గని అయిదవ భాగంలో ఇరవై బోట్లు మోస్తున్న గని పై భాగం అకస్మాత్తుగా కూలిపోయింది. ఎనమండుగురు కూలి వాళ్ళు అందులో చిక్కుపడ్డారు. మూడు గంటల తరవాత అందులో అయిదుగురిని పైకితీశారు. వాళ్ళకి దెబ్బలు తగిలినా బ్రతికే ఉన్నారు. ఆరోగ్యంగానే ఉన్నారు కూడా. మిగతా ముగ్గుర్నీ ఇవతలికి తీయడానికి గంటలు పట్టింది. చివరకి, పదకొండు గంటల ప్రాంతాన్ని వాళ్ళనీ తీశారు బయటికి—వాళ్ళ శవాల్ని.

అంతకంటే జరిగింది ఏమీ లేదు. గనిప్రమాదం-అయిదుగురు బ్రతికారు, ముగ్గురు చచ్చిపోయారు అంచేత యీమాటు కూడా ఏదో సవ్యంగానే జరిగి పోయింది. పట్టణంలోకూడా, చచ్చిపోయిన వాళ్ళబంధువులు తప్ప మరెవ్వరూ దీన్ని గురించి ప్రస్తావించ లేదు.

రేడియోలోనూ టెలివిజన్ మీదా ప్రాంతీయ కార్యక్రమాలలో ఈ ప్రమాదాన్ని గురించి ప్రసారం చేశారు. గనికి ఆహుతి అయిన ముగ్గురు సామాన్య కార్మికుల విషయమై అంత ఆవేశపడవలసిన అగత్యం ఏముంది? ప్రతిరోజూ ప్రపంచకం ఎంతగానో మారిపోతోంది. దేశాలు దేశాలు అల్లకల్లోలమై పోతున్నాయి. పట్టణాలు ధ్వంసమై పోతున్నాయి. నదులు గట్లు తెంచుకుంటున్నాయి.

పర్వతాలు గంధకపు జ్వాలల్ని విరజిమ్ముతున్నాయి. ముగ్గురు మామూలు కూలి వాళ్ళని గురించి ఆవేశపడవలసిన అవసరమేముంది?

వాళ్ళ వృత్తికి వాళ్లు బలి అయిపోయారంతే.

రూర్‌లో ఇలాంటి వార్తలు మామూలే. రోడ్డుమీద దుమ్ములాగ, ఇలాంటి పమాదాలు నిత్యజీవితంలో భాగాలు.

పన్నెండైంది.

వాళ్ళ మూడు మృతశరీరాలూ, ఒక గొట్టంగుండా పగటివెలుగులోకితీశారు. చనిపోయిన వాళ్ళని గురించి, వాళ్ళ దగ్గరబంధువులకు కబురు ఎవరు మోసుకు వెళ్ళాలి—అన్న ప్రశ్నను గురించి చర్చించడానికి, గని యజమానులు, కార్మిక సంఘం, గని కార్యాలయంలో సమావేశమయారు. యజమానులు, కార్మికుల స్నేహితులూ కూడా ఈ బాధ్యత నెత్తిమీద పడకండా తప్పించుకుంటారు. అసలు చావు కబురు మోసుకెళ్ళి, మొట్టమొదటి దుఃఖపు పొంగు చూస్తూ, నిలబడ్డానికి ఎవరికిష్టముంటుంది? అంతవరకూ సంతోషంగా ఉన్న ఇంట్లో చిచ్చుపెట్టిన నేరస్థుడిలాగ అనిపిస్తుంది వెళ్ళినవాడికి. అతన్ని ఓదార్చేవారెవరూ ఉండరు—

రెండు చావుకబుర్లు మొయ్యడానికి వార్తాహరులు తొందరగానే దొరికారు. మూడో కబురు మొయ్యడానికి చాలాసేపటివరకూ ఎవరూ ముందుకి రాలేదు. ఆ ఇంటికిపోవడానికి అందరూ వెనకాడారు. ఎందుకంటే, ఆకుటుంబంలో మూడేళ్ళ ఈ మధ్య ఇద్దరు కొడుకులు, గనిలో సమాధి అయిపోయారు. ఇప్పుడు ఇరవై ఒకటి వయస్సు గల మూడో కొడుకు మృతశరీరం స్నానాల చావడి వెనకాల పడుకోబెట్టబడి ఉంది.

గడ్డకట్టుకుపోయిన నిశ్శబ్దాన్ని భేదిస్తూ. "నేను వెడతాను," అన్నాడు, కార్మికసంఘ సభ్యుడు, బ్రింఖోఫ్.

అతను దృఢంగానే అన్నాడు, గొంతు కొంచెం బొంగురుపోయినా. అన్న వెంటనే, చలనం లేని మిగతా సభ్యుల ముఖాలవంక జాగ్రత్తగా చూశాడు, ఇంకెవరన్నా తన కీ బాధ్యత తప్పించడానికి ముందుకి వస్తారేమోనని. కాని ఏడుముఖాలూ 'అమ్మయ్య' అనుకుంటున్నట్టు ఉన్నాయి. ఎందుకంటే ఈసారి ఎవరో ఒకరు తనంతట తను ఈ భారం భుజాన్ని వేసుకున్నాడు. తరుచుగా జరిగేటట్టు, చీట్లుతీసి నిర్ణయించవలసిన అగత్యం లేకపోయింది. 'పిరికి పీనుగులు' అనుకున్నా

డతను. పనికిరాని విషయాలను గురించి బల్లగుద్ది గట్టిగా వాదిస్తారు. పనొచ్చి నప్పుడు నోరు పెగలక తోక ముడుస్తారు. సరేకానీ నే నొప్పుకున్నాను. కాని సాయంకాలం టెలివిజన్‌లో ప్రసారమయ్యే ఫుట్‌బాల్‌పోటీ ఎల్లాగైనాచూడాలి.

బ్రింఖోఫ్ వెళ్ళిచూడవలసిన హాక్ కుటుంబం, ఊరి చివర కొత్తగా కట్టించిన పేటల్లో ఒకదాంట్లో ఉంటున్నారు. ముసిలి హాక్. ఊపిరితిత్తులు ధూళి పీల్చటం వల్ల చెడిపోయాయి. పదేళ్ళుగా అతను రోగిష్టి. .అతను బయట తోట పని చేస్తున్నాడు. తవ్వుగోల ముసిలిచేతుల్లో పైకెత్తి నీరసంగా నేలలోకి దింపుతూ, మధ్యమధ్య కళ్ళపైన ఎండపడకండా చెయ్యి అడ్డుపెట్టి, రోడ్డువంక చూస్తున్నాడు, బ్రింఖోఫ్ వస్తున్న రోడ్డువంక. కార్మికసంఘ సభ్యుడు తోట గుమ్మం దగ్గర ఆగాడు : నమస్కారాలు విలియం ! అంత శ్రమ పడతావెందుకు? రోజూ కాస్త కాస్త చొప్పున పని చేసుకుంటే చాలు.

వాతావరణం బాగుందీ వేళ. తొందరగా వచ్చిన పని ముగించుకు వెళ్లాలి. బ్రింఖోఫ్ మెల్లగా మామూలు కబుర్లు చెప్పాడు.

పాపం, ఆదిరిపోతాడు ముసలాడు, అనుకున్నాడు బ్రింఖోఫ్.

అతను స్వతంత్రుడు. తన కిష్టముంటే పని చేస్తాడు, లేకపోతే లేదు. ఫుట్‌బాల్ పోటీ చూసితీరాలి ఏమైనా సరే.

ఆ, అన్నాడు హాక్. నువ్వా ఫ్రెడ్ ! రా ! రా ! మరే. గడ్డి పెరుగుతూనే ఉంటుంది. ప్రతి రోజూ కలుపు తీసేస్తుండాలి. గడ్డిపీకేసి పూలమొక్కల్ని కాపాడాలి.

ఏమైనా సరే, ఫుట్‌బాల్ పోటీ చూసితీరాలి, అనుకున్నాడు బ్రింఖోఫ్. యూ[1] ఆడుతున్నాడో లేదో ఈ వేళ.

ఎవరికోసం ఎదురుచూస్తున్నావు ? అన్నాడు బ్రింఖోఫ్.

ఎదురుచూడ్డమా ? మరే, అబ్బాయింకా యింటికి రాలేదు. రాత్రిపని వాడిది. మధ్యాహ్నం రెండైపోయింది. పగలు కూడా పని చేస్తున్నాడో ఏమో. పిచ్చిపిల్లాడు. నీకు తెలుసా, వాడి కో మంచి పిల్లకూడా దొరికింది. మోటార్ బైక్ కొనాలనుకుంటున్నాడు. ఈ రోజుల్లో కుర్రాళ్ళ సంగతి నీకు తెలుసుగా. ఇంటిపట్టుని ఉండడం వాళ్ళకి కిట్టదు. తోటా దొడ్డీ విషయం, వాళ్లేం పట్టించు

---

[1] యూసీలర్ అంతర్జాతీయ ఖ్యాతి గల సెంటర్ ఫార్వర్డ్.

కోరు. ఎప్పుడూ పని, పని. అనవసరం. నా పెన్షన్‌లోంచి కూడా కొంత వాడి కిస్తాను.

అవును అన్నాడు బ్రింఖోఫ్. టెలివిజన్ మీద ఇంకో గంటలో ఫుట్‌బాల్ పోటీ ప్రసారమౌతుంది అనుకున్నాడు.

ఈ కుర్రాళ్ళకి వేగం, వేగం కావాలి; అన్నాడు ముసిలి హాక్. అన్నప్పుడు అతని ముఖంలో చిరాకు ప్రతిఫలించింది.

ఏ రకం కొనాలనుకుంటున్నాడు, అని అడిగాడు, కార్మిక సంఘ సభ్యుడు. మోటార్ సైకి లేమిటింకా. పిచ్చికాకపోతే, అనుకున్నాడు. ఈ రోజుల్లో మోటార్ సైకిల్ ఎవరు కొంటారు ? నాలుగు చక్రాలు నాలుగు చక్రాలే. పైన చల్లగా టాపు ఉంటుంది కారైతే. ఈ వేళ యూ ఆడుతున్నాడో లేదో.

నాకేం తెలుస్తాయి ఫ్రెడ్, ఈ విషయాలు ? ఏదో ఇటాలియన్ సైకిలట. ప్రతీ సాయంత్రం ఆ పిల్లా మావాడూ కలిసి కాటలాగులు ఒకటే తిరగెయ్యడం. వెనకపక్క, దూళ్ళసాల ఉండేదే, అదిపెంచి ఒక గరాజ్ తయారుచేసుకున్నాడు. బాగా కట్టాడు తెలుసా, కాగితాలు కూడా అంటించాడు, రంగుల కాగితాలు, ఇంట్లో గోడల కంటించగా మిగిలినవి — అతుకులుగా ఉందనుకో, గరాజ్. అయినా బాగానే ఉంది. కుర్రాళ్ళ ఊహలన్నీ వేరు ఈ కాలంలో. హాక్ తృప్తిగా చిఱునవ్వు నవ్వుకున్నాడు.

ఇల్లాగే పిచ్చాపాటీ పట్టాడుతూ కూర్చుంటే, అంతర్జాతీయ పోటీ చూడ్డం పడదు, అనుకున్నాడు బ్రింఖోఫ్. కాని పైకి అన్నాడు : అయితే ఎప్పుడు కొనా లనుకుంటున్నాడు, ఈ టపటప ఖరీదైనదా ?

వచ్చేవారం అన్నాడు ముసలి హాక్. నేనూ ఎదురుచూస్తున్నాను. పక్షుల ప్రదర్శనానికి నన్ను తీసికెళతానన్నాడు. అన్నింటికీ. దాన్ని టపటప అనకూడదు. చప్పుడేం చెయ్యదట అది. దాని శక్తి, ఏదో 'పోన్స్' లోనో ఎందులోనో కొలు స్తారట.

అయ్యోరాత, అనుకున్నాడు బ్రింఖోఫ్. సంగతి తెలియకండా మాట్టాడు తున్నాడు. చుట్టుపక్కల అందరికీ తెలిసింది, ఎవరూ చెప్పలేదు. నేను చెప్ప డానికి ఒప్పుకోక తప్పింది కాదు. పాడు గొడవ. యూ ఆడుతున్నాడో లేదో ఈ వేళ.

ఇంతకీ మా వీధి కెందుకొచ్చావు ? అని అడిగాడు హాక్ ఉన్నట్టుండి. పావురాలు కొంటావా ?

బ్రింఖోఫ్ గడియారం చూసుకున్నాడు. ఇల్లాగే లాగితే, నా కింక ఫుట్‌బాల్ చూసే యోగం ఉండదు.

ఈవేళ శలవు పెట్టావా ? అని మళ్ళీ అడిగాడు హాక్.

లేదు విలియం, నా శలవంతా మార్చిలోనే ఖర్చుపెట్టేశా. ఇల్లు పూర్తి చెయ్యడానికి శలవుపెట్టేశా.

అవున్లే ఫ్రెడ్, ఇప్పుడు హాయిగా సొంతయింట్లో ఉండొచ్చు. నేనూ అంతే. సొంత యిల్లు కట్టేశా, కాని ఇప్పుడు అంతా తీరికే.

అవును అనుకున్నాడు బ్రింఖోఫ్, దీర్ఘరోగమంత సుఖమైనది లేదు.

నే చెప్పేది, రోజంతా నీ యిష్టమొచ్చినంత పని చెయ్యొచ్చు. హడావిడి లేదు. ఎవరూ నిన్ను తొందర పెట్టరు. విధా కర్మమూ అని చెయ్యక్కర్లేదు. ఎద్దులాగుండి అలిసిపోయినట్టు నటిస్తావేం, అని ఎవ్వరూ అనరు.

కాని మన పని అయిపోయింది. ఊపిరితిత్తులు సరిగ్గా పనిచెయ్యవు. నిజంగా పొగమంచు పట్టిందంటే, మహా భయం నాకు. ఊపిరాడదు. పెన్షన్ తగినంత రాదు. ముసలాళ్ళమయేసరికి, సడలిపోతాయి శరీరాలు. దిగులెక్కువౌతుంది. అయితే ఏం జేస్తాం ? బ్రతుకే అంత.

మనం కూలివాళ్ళం, అన్నాడు బ్రింఖోఫ్, తనలో అనుకున్నాడు : కాని పని చేయించే వాళ్ళదే దోషమని అన్ని విషయాల్లోనూ చెప్పలేం. చేసేవాళ్ళ దోషమూ ఉంటుంది. అంతర్జాతీయ పోటీ చూసే యోగం ఉందా తనకి ?

నిగ్గేమియర్ తన స్థలం అంతా అమ్మేస్తున్నాడు. ఊరి మధ్యకి మారుతున్నాడు. అతని భార్యకి పినతండ్రి తాలూకు ఇల్లు సంక్రమించింది తెలుసుగా. అందులోకి మారుతున్నాడు. కాని అక్కడ పావురాలు పెంచడం కుదరదు. పావురాలు చవకే ఇక్కడ. అతని దగ్గర మంచి రకాలున్నాయి, ఎన్నో బహుమతులు కూడా కొట్టేశాయి. నిగ్గేమియర్‌కి దురాశకూడా లేదు. అయితే పావురాలు ఎంతకిస్తాడు ? అని అడిగాడు బ్రింఖోఫ్

ఇల్లా పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చుంటే, ఇంక నేను ఫుట్‌బాల్ పోటీ చూడలేను.

కావాలంటే నీ తరఫున అతనితో మాట్లాడతాను. లేకపోతే ఇప్పుడే వెడదాం, రా. నాలుగిళ్లు అవతలే అతనుండేది. అంటే నీకు నిజంగా కొనాలనుండి, తీరికుంటే సుమా....

వొద్దు విలియం, అన్నాడు బ్రింఖోఫ్ వెంటనే. మరోసారి ఎల్లాగా రావాలి ఈ ప్రక్కకి.

అయ్యో భగవంతుడా, ఫ్రెడ్, గని దగ్గర ఏవ(న్నా జరిగిందా? ముసలి హాక్ బ్రింఖోఫ్ని క్రిందినించి పైదాకా చూశాడు.

అయ్యో భగవంతుడా అనుకున్నాడు బ్రింఖోఫ్. ఇతనికింకా తెలియదే· చుట్టుప్రక్కల అందరికీ ఇతని కొడుకు చచ్చిపోయాడని తెలుసు. ఇరుగుపొరుగు వాళ్ళు ఎంత పిరికి పందలు. ఒక్కరు చెప్పలేదు. యూ ఆడుతున్నాడో లేదో ఈ వేళ.

అవును విలియం. "సూర్య"—గని అయిదో భాగం—తూర్పువైపుది. నీకు అప్పట్నుంచీ తెలుసుగా ఆ భాగం.

ఏవిటి? "సూర్య" గనా? ఐదవభాగం, తూర్పువైపుది. అవునవును. "సూర్య" గని బలమైన గడ్డ కాదు. మా రోజుల్లో....వారాని కొకసారి కూలి పోతుండేది. ఏదో శాపం ఉన్నట్టు. నువ్వెంత జాగ్రత్తగానైనా పక్కలు కట్టు కుంటూ రా. ఎక్కడో జారిపోతుంటుంది. ఆ దిక్కుమాలిన గని మూసెయ్యరు. అందులో మంచి బొగ్గు చవగ్గా దొరుకుతుంది మరి. కొద్దిమందికి గాయాలైనా, కొద్దిమంది చచ్చిపోయినా లెక్కేముంది. ముఖ్య విషయం, కావలసినంత బొగ్గు, చవక. అసలు బొగ్గు ఒకటో రకం. ఇదివరకెప్పుడూ అంతే, ముందుకూడా అంతే. మనమేం మార్చలేం. నా అదృష్టంకొద్దీ ఇంక నే నటు పోనక్కరలేదు.

పైన పల్టీలు కొడుతున్న గువ్వల జంటవేపు చూశాడు హాక్. ఆహా, అన్నాడు. ఎంత అందంగా ఉన్నాయి. ఎన్నో రోజులుగా చూస్తున్నాను వాటిని. ఆ రెంటికీ అపైనే పెళ్ళి ఏర్పాటు చేసేస్తే మహచక్కగా ఉంటుంది.

పత్రికలో వ్రాశారు. యూ ఈసారి జట్టులో ఉంటాడో ఉండడో సందేహ మని, పాత నొప్పి బహుశా మళ్ళీ బయటపడి ఉంటుంది, అనుకున్నాడు బ్రింఖోఫ్.

అవునుగాని, నువ్వన్న దేమిటి? అని అరిచాడు ముసలి హాక్.

ఏమన్నావు ? ఐదవభాగం, తూర్పువైపుది, ఐదవ భాగమేనా ? మరి.... మరి....మావాడు అక్కడేగా పని చేసేది ? ఫ్రెడ్, ఏమయింది చెప్పు.

అతని కొడుకు మంచి చురుకైన ఫుట్‌బాల్ ఆటగాడు. సరియైనవాళ్ళ చేతులో పడితే, ఏమో ఫెడరల్ జట్టులో ఆడేవాడేమో. ఈ పని భుజంమీద వేసుకోకపోతే, ఈపాటికి టెలివిజన్ ముందు కూర్చుని ఉండేవాణ్ని.

కూలిపోయిన గనిలో మొత్తం ఎనమండుగురు విలియం, అన్నాడు కార్మిక సంఘ సభ్యుడు, బరువుగా. ఎగురుతున్న గువ్వల జంటను పరీక్షగా చూస్తూ అన్నాడు. చెరోప్రక్కనీ ముందుకి సాగే ఫుట్‌బాల్ ఆటగాళ్ళలాగ, అన్నాడు హాక్ కి వినబడకండా.

అవును. మొత్తం ఎనమండుగురు, కూలిపోయిన గనిలో. ఐదుగుర్ని వెంటనే బయటికి తీయగలిగాం. ముగ్గురు మట్టుకు చిక్కుపడ్డారు. అవును. ముగ్గురు.

ముసలి హాక్ పైప్ వెలిగించాడు. పైపులో పుగాకు లేదు. కాని అగ్గిపుల్ల తరవాత అగ్గిపుల్ల వెలిగిస్తూనే ఉన్నాడు. అతని కాళ్ళ దగ్గర ఎన్నో పుల్లలు పోగుపడ్డాయి. హాక్ మళ్లీ బ్రింఖోఫ్ వచ్చిన వీధివంక చూశాడు.

ముగ్గురా చిక్కుకుంటా ! ముగ్గురన్నావు కాదూ ? ముగ్గురన్నావు, ఫ్రెడ్. ముగ్గురు. ముగ్గురే ఎందుకు....అవును. అందుకే అబ్బాయింకా ఇంటికి రాలేదు. అందుకే. అవును. అదా సంగతి. కొద్దిసేపు గడ్డకట్టుకు పోయిన నిశ్శబ్దం. ఆ తరవాత ముసలి హాక్ నవ్వాడు, ఏదో నవ్వు పుట్టించే కథ కొత్తగా విన్నట్టు. అన్నమాట సంగతి, ఫ్రెడ్. అందుకోసమే అసలు నువ్వు వచ్చింది. నేనేదో పిచ్చివాడిలాగ పావురాలు కొనడాని కొచ్చా వనుకున్నాను. ఇప్పుడు నిగ్గేమియర్ అన్నీ అమ్మేస్తున్నాడు గదా అని.

గువ్వల జంట ఇంకా పైన పల్టీలు కొడుతూనే ఉంది. ముసలి హాక్ ఇప్పుడు కాళ్ళదగ్గరున్న అగ్గిపుల్లలవంక చూస్తున్నాడు. కాలిన అగ్గిపుల్లలు. అవును, అన్నాడు మళ్ళీ. "సూర్య," గనిలో గడ్డ బలమైనదికాదు. గాజులాగ పెళుసు.

అర్థమైందా అతనికి ? ఆట ఇప్పుడింక ప్రారంభమౌతుంది. యూ ఆడుతున్నాడో లేదో.

ముగ్గురు చిక్కుపడ్డా రన్నమాట. ముగ్గురన్నావు కదూ, ముగ్గురెందుకు? ఇద్దరెందుకు కాకూడదు!....ఒక్కరెందుకు....ఎవ్వరూ చిక్కుపడకండా ఉండ కూడదూ? అకస్మాత్తుగా గొంతెత్తి అరిచాడు. అసలు ఎవరైనా ఎందుకు చిక్కు పడాలి? ఫ్రెడ్, ఎందుకు? ఎందుకు చిక్కుపడాలి? ఎందుకో తెలుసా? ఆ పెద్దల లెక్కలో ఒక టన్ను బొగ్గు మనిషికన్నా విలువైనది. అంతేనా? ఏమం టావు? అంతేనా?

అబ్బ! ఎంత విలువైన మాటన్నాడు ముసలాడు, అనుకున్నాడు, బ్రింఖోఫ్. అక్షరాలా నిజం. అయితే మనం దాన్ని ఎల్లా మార్చగలం? మనం గనుల్ని మూసేయించగలమా?

హాక్ ఇంటివైపు చూశాడు. అతని భార్య ఇవతలికి వచ్చింది. వీధివంక చూసింది. గేటుదగ్గర నిలబడ్డ ఇద్దరివైపూ పరీక్షగా చూడలేదు. పొద్దున్న పనిలోకి వెళ్ళిన గని పనివాళ్లు అప్పుడే ఇళ్ళకి హడావిడిగా నడుస్తూ పోతున్నారు.

వాళ్ళంతా వెళ్ళి తనకన్నా ముందు టెలివిజన్ ముందు కూర్చుంటారు, అనుకున్నాడు బ్రింఖోఫ్.

కాని ఫ్రెడ్, మా ఆవిడ కెల్లా చెప్పను? ఎల్లాగ? అన్నాడు ముసలి హాక్ క్రుంగిపోతూ.

ఏమిటిది విలియం. ఏమిటిది?

ఫ్రెడ్, నువ్వొచ్చినందుకు ధన్యవాదాలు. కాని మా ఆవిడ కెలా చెప్పను? ఏమని చెప్పను? ఎలా?

నేను వెళ్ళి చెపుతా, అన్నాడు బ్రింఖోఫ్,

నాకేమన్నా మతిపోయిందా? ఎలా చెప్పగలను? తరవాత హాక్ తనబంధువు లందరికీ చెప్పమంటే! ఆట ప్రారంభమై ఉంటుంది. ముసలి హాక్ మొక్కల కత్తెర పుచ్చుకుని. తన ఎత్తున పెరిగిన డెల్ఫినియం పొద దగ్గరకు వెళ్ళాడు.

బ్రింఖోఫ్ ఆమె లోపలికి వెళ్ళేదాకా ఆగాడు. తరవాత మెల్లగా ఈడ్చు కుంటూ వెళ్ళాడు. హాలులోకి కాల్చిన చేపల వాసన కొడుతోంది. ముసలిది గిన్నెలు ఇటూ అటూ కదపడం విన్నాడతను.

ఎంతోసేపు కార్మికసంఘ సభ్యుడు బ్రింఖోఫ్ హాల్లో అల్లాగే నిలబడ్డాడు, బరువుగా ఊపిరిపీలుస్తూ. చిన్నపిల్లాడిలాగ, ఆఖరికి తన కోటు బొత్తాములు లెక్క

పెట్టుకున్నాడు. చెప్పనా ? ఒద్దా ? చెప్పనా ? చటుకుని దగ్గరగా మూసిఉన్న తలుపు తోశాడు. ముసలిది ఆశ్చర్యంగా చూసింది, గుమ్మందగ్గర నిలబడ్డ కొత్తవ్యక్తి, తన భర్తాకాదు. బిడ్డాకాదు.

ఏం నాయనా ? మా వారిని చూడాలా ? తోటలో ఉన్నారాయన. అన్నట్టు నువ్వింతక్రితం ఆయనతో మాట్టాడుతున్నావుగా.

ఇంక చెప్పెయ్యాలి, అనుకున్నాడు. తొందరగా. తొందరగా చెప్పేస్తే తీరి పోతుంది. చటుకుని చెప్పెయ్యి, అంతే.

అతను మాట్టాడలేదు. ముసలామెకు దగ్గరగా వెళ్ళి చెప్పాలనుకున్నాడు. అయితే గుమ్మంలోనే నిలబడి ఉండిపోయాడు. హాట్ చేతిలో పట్టుకున్నాడు. చేతిలో హాట్. చేతిలో ఉంది హాట్. అంతే.

కార్మిక సంఘ సభ్యుడు బ్రింఖోఫ్ ఆమెవంక చూశాడు. అంతకంతకి ఆమె కళ్ళు పెద్దవి కావడం చూశాడు. హఠాత్తుగ్గా కుర్చీలో కూలిపోడం చూశాడు. ఆమె ఆర్తి గొంతు చీల్చుక వచ్చింది, లేదు, లేదు. అబద్ధం. అంతా అబద్ధం. లేదు లేదు లేదు.

బ్రింఖోఫ్ చటుకుని వెనక్కి తిరిగి అవతలికి పరుగెత్తుకు పోయాడు. ముసలతను డెల్ఫినియం పొదమీద పొడుగాటి నీలిరెమ్మలు కత్తిరిస్తున్నాడు, బ్రింఖోఫ్‌తో అన్నాడు. మా మరదలు వస్తుందా లీపాటికి. ఈపాటికి రావలసిందే. పువ్వులు కోసుకుని ఈ పార పట్టుకు పోతుంది. ఆమెకు మంచి బొచ్చుకోటుంది గాని, పార లేదు.

నువ్వు లోపలికి వెళ్ళొచ్చు, అన్నాడు బ్రింఖోఫ్ అవతలికి పరుగెత్తుతూ. అలాగే ఫ్రెడ్. అలాగే. చక్కని పిల్లని ఎన్నుకున్నాడుకూడా. ఎంత....గువ్వల జంట అదృశ్యమై పోయింది.

కార్మికసంఘ సభ్యుడు బ్రింఖోఫ్ రోడ్డుమీదికి వచ్చేసరికి, స్నానంచేసినట్టు చెమటలు కారుతున్నాయి. చొక్కా వంటికి చిక్కగా అంటుకుపోయింది. కను బొమల మధ్య బొట్లు పేరుకున్నాయి. తరవాత బ్రింఖోఫ్ వీధివెంట గబగబా నడిచాడు. వీధులో మనిషేలేదు. పాడుపడ్డట్టుంది వీథి. వీధిచివర, పేట అంతమైన చోట రోడ్డుపక్కన దుమ్ముతో కప్పబడ్డ పచ్చికమీద చతికిలపడ్డాడు బ్రింఖోఫ్. ముఖం తుడుచుకున్నాడు.

వాళ్ళ దుంప తెగ, ఏం మనుషులు వాళ్ళు. ఏం మనుషులు. టెలివిజన్ సెట్ ముందు కూచుని బంతాట చూస్తున్నారు? ఏం మనుషులని వాళ్లు? చూస్తున్నారు, చూస్తున్నారు, గొంతుకలు బొంగురుపోయేలా అరుస్తున్నారు. ఇంక నా సంగతేమిటి ....?

ఇంతకీ యూ ఆడుతున్నాడో లేదో ?